# ఈ-కేవైసీ పేరిట దోపిడీ



ఆర్మూర్‌లో ఓ గ్యాస్ ఏజెన్సీ వద్ద బారులు తీరిన వినియోగదారులు (ఫైల్)

- అక్రమాలకు తెరలేపిన ఎల్‌పీజీ డీలర్లు
- ఉదయం నుంచే గ్యాస్ ఏజెన్సీల ఎదుట జనం బారులు
- ఇదే అదునుగా దోపిడీకి పాల్పడుతున్న కొందరు నిర్వాహకులు
- ఉచితంగా చేయాల్సిన ఈ-కేవైసీ ప్రక్రియకు డబ్బులు వసూలు
- మరికొందరేమో బలవంతంగా గ్యాస్‌పైపులు అంటగడుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు.. మండిపడుతున్న ప్రజలు

బాల్కొండ, డిసెంబర్ 15: ఈ-కేవైసీ పేరుతో కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారు. గ్యాస్ ఏజెన్సీలకు వచ్చే వారి నుంచి దోపిడీకి పాల్పడుతున్నారు. ఈ నెలాఖరులోపే ఈ-కేవైసీ చేయించుకోవాలని ప్రచారం జరగడంతో జనం గ్యాస్ ఏజెన్సీల వద్ద బారులు తీరుతున్నారు. దీంతో ఉదయం నుంచే ఏజెన్సీల వద్ద విపరీతమైన రద్దీ నెలకొంటున్నది. రాత్రి దాకా ఇదే 'వరుస' కనిపిస్తున్నది. గ్యాస్ వినియోగదారులు ఈ-కేవైసీ చేయించుకుంటేనే రూ.500కు వంటగ్యాస్ పథకం అమలవుతుందని ప్రచారం జరగడమే ఇందుకు కారణం. వాస్తవానికి ఈ-కేవైసీ చేయించుకోవడానికి నిర్దేశిత సమయం లేదని వంటగ్యాస్ డీలర్లు స్పష్టం చేస్తున్నారు. వీలైనంత త్వరగా కస్టమర్ల ఈ-కేవైసీ పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించిందని చెబుతున్నారు. ప్రస్తుత ఈ-కేవైసీ ప్రక్రియకి, రూ.500కు సిలిండర్ పథకానికి సంబంధించి ఎలాంటి సంబంధం లేదని తేల్చి చెబుతున్నారు. ఇదేమి తెలియని జనం మాత్రం ఏజెన్సీల వద్ద బారులు తీరుతున్నారు.

**ఏజెన్సీల ఎదుట బారులు..**

ఎన్నికల ముందర కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో భాగంగా రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని హామీ ఇచ్చింది. ప్రస్తుతం హస్తం పార్టీ అధికారంలోకి రావడంతో వంటగ్యాస్ పథకం ఎప్పుడు ప్రారంభమవుతుందని వినియోగదారులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే, సబ్సిడీ వంటగ్యాస్ పొందాలంటే ఈ నెలాఖరులోపే ఈ-కేవైసీ చేయించుకోవాలని పుకార్లు చెలరేగాయి. దీంతో జనం ఏజెన్సీలకు పరుగులు పెడుతున్నారు. ఉదయం నుంచి రాత్రిదాకా క్యూలో నిల్చుని మరీ ఈ-కేవైసీ చేయించుకుంటున్నారు.

**అక్రమాలకు తెర..**

వినియోగదారుల ఆత్రుతను ఏజెన్సీల నిర్వాహకులు కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. ఏజెన్సీలే ఉచితంగా ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. అయితే, కొందరు గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు ఈ ప్రక్రియ చేపట్టకుండా మీసేవ నిర్వాహకులకు అప్పగించారు. తమ లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ వివరాలు వారికి ఇచ్చి వినియోగదారులను అక్కడికి పంపిస్తున్నారు. మీసేవకు వెళ్లిన కస్టమర్ల నుంచి మీసేవ నిర్వాహకులు డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇక మరికొన్ని ఏజెన్సీలేమో తమ వద్దకు వచ్చిన వినియోగదారులకు ఉచితంగానే ఈ-కేవైసీ చేస్తున్నా, నిర్బంధంగా గ్యాస్ పైపును అంటగడుతున్నారు. కస్టమర్లు వద్దంటున్నా తీసుకోవాల్సిందేనని బలవంతం చేసి మరీ కొనిపిస్తున్నారు. మార్కెట్‌లో రూ.100లకు లభించే గ్యాస్‌పైప్‌ను రూ.200లకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. బాల్కొండ సహా పలుచోట్ల ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు స్పందించడం లేదని వినియోగదారులు వాపోతున్నారు.

**ఇంటికే వచ్చి ఈ-కేవైసీ..**

ఈ-కేవైసీ పూర్తి చేయడానికి నిర్దేశిత సమయం లేదని గ్యాస్ డీలర్లు స్పష్టం చేస్తున్నారు. అయితే, ఉజ్వల గ్యాస్ కనెక్షన్ ఉన్న వారు మాత్రం ఈ నెలాఖరు లోపు ఈ-కేవైసీ చేయించుకోవాల్సి ఉందని చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉజ్వల గ్యాస్ కనెక్షన్ వినియోగదారులు నిర్దేశిత సమయంలోపు చేయించుకుంటే సరిపోతుందన్నారు. ఈ నెలాఖరులోగా ఈ-కేవైసీ చేసుకుంటేనే రూ.500లకు వంటగ్యాస్ ఇస్తారనే ప్రచారంలో వాస్తవం లేదన్నారు. రూ.500కు వంటగ్యాస్ పథకానికి సంబంధించి ఎలాంటి విధివిధానాలు తమకు అందలేదని స్పష్టం చేశారు. మరోవైపు, ఈ-కేవైసీ కోసం వినియోగదారులు ఏజెన్సీల వద్దకు వచ్చి ఇబ్బందులు పడాల్సిన అసవరం లేదని ఎల్‌పీజీ డీలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. తమ డెలివరీ బాయ్‌లు ఇంటికి వచ్చినప్పుడు ఈ ప్రక్రియను పూర్తి చేయించుకోవచ్చన్నారు. తప్పుడు ప్రచారాలు నమ్మి ఏజెన్సీల వద్ద బారులు తీరి ఇబ్బందులు పడవద్దని సూచించారు.

**బలవంతంగా ఇవ్వడం లేదు..**

ఉజ్వల కనెక్షన్ ఉన్న వారు మాత్రమే ఈ నెల 31 లోపు ఈ-కేవైసీ చేయించుకోవాలి. కానీ అందరూ ఈ-కేవైసీ చేయాలని వస్తున్నారు. ఉదయం నుంచే బారులు తీరుతున్నారు. మేము ఎవరి వద్ద డబ్బులు వసూలు చేయలేదు. బలవంతంగా గ్యాస్ పైపు అంటగట్టడం లేదు. కనెక్షన్ తీసుకుని ఐదేండ్లు దాటిన వారు మాత్రం పైపు మార్చుకోవాలని చెబుతున్నాం. వారు అడిగితే మార్కెట్ ధర ప్రకారమే డబ్బులు తీసుకుని పైప్ ఇస్తున్నాం. ఒక్క రూపాయి కూడా ఎక్కువగా తీసుకోవడం లేదు.

–రాధాకృష్ణ,
ఇండియన్‌గ్యాస్ డీలర్, బాల్కొండ









తెలంగాణ శాసనసభ సమావేశాల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు శుక్రవారం ఉత్సాహంగా పాల్గొన్నారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డితోపాటు కామారెడ్డి, ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, రూరల్ ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, భూపతిరెడ్డి హాజరయ్యారు. గవర్నర్ ప్రసంగాన్ని శ్రద్ధగా ఆలకించారు.

## క్యాంప్ కార్యాలయం పరిశీలన





మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన క్యాంప్ కార్యాలయాన్ని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. తుదిదశ సుందరీకరణ, కాంపౌండ్‌వాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. క్యాంప్ కార్యాలయం బయట చేపట్టాల్సిన పనులపై ఆర్అండ్‌బీ అధికారులు, వర్క్స్ ఏజెన్సీ నిర్వాహకులకు ఆదేశాలు ఇచ్చారు. పనులను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. వేముల వెంట అధికారులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

–బాల్కొండ, డిసెంబర్ 15

## 8 నుంచి 10 విద్యార్థులకు డిజిటల్ తరగతులు

**రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ**



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్, డీఈవో



మాట్లాడుతున్న వాకాటి కరుణ

నిజామాబాద్ స్పోర్ట్స్, డిసెంబర్ 15: ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు డిజిటల్ క్లాస్‌రూమ్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ అన్నారు. ప్రభుత్వ బడుల్లో మెరుగైన ఫలితాల సాధన కోసం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తూ నిర్ణీత లక్ష్యాలను సాధించాలని సూచించారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేనతో కలిసి శుక్రవారం ఆమె ఆయా జిల్లాల కలెక్టర్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, జిల్లా విద్యాశాఖ అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. వివిధ జిల్లాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు.. వాటి నిర్వహణ తీరతెన్నులపై ఆరా తీశారు. అక్షరాస్యత శాతం గణనీయంగా మెరుగుపడేలా బలమైన పునాది వేయడం, ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం, గణితంపై ఆసక్తిని పెంపొందించేలా నాణ్యమైన విద్యను బోధించడం, విద్యాభివృద్ధిలో ప్రజాప్రతినిధులను విద్యార్థులు తల్లిదండ్రులను భాగస్వాములు చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. వెనుకబడి ఉన్న అంశాలను ప్రస్తావిస్తూ వాటి మెరుగుదలకు చేపట్టాల్సిన చర్యలు, అనుసరించాల్సిన పద్ధతులపై మార్గనిర్దేశం చేశారు. ముఖ్యంగా విద్యార్థులను ఆకట్టుకునే రీతిలో, వారు సులభంగా ఆకళింపు చేసుకునేలా పాఠ్యంశాలను బోధించేలా చూడాలన్నారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు డిజిటల్ క్లాస్‌రూమ్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జూమ్ మీటింగ్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, డీఈవో దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

# సీఎంసీ, ఆర్‌కే కళాశాలల పరిశీలన



డిచ్‌పల్లిలోని సీఎంసీ భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్

- లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ కోసం..
- అధికారులకు కలెక్టర్, సీపీ సూచనలు

ఇందల్వాయి/బోధన్, డిసెంబర్ 15 : డిచ్‌పల్లిలోని సీఎంసీ, బోధన్ పట్టణంలోని ఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాల భవనాలను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్ శుక్రవారం సందర్శించారు. సమీప భవిష్యత్తులో జరుగనున్న పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా జిల్లా ఉన్నతాధికారులు అనువైన భవనాలను పరిశీలించడంలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే కలెక్టర్ గురువారం బోధన్‌లోని ఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాలను పరిశీలించిన విషయం విధితమే. తాజాగా శుక్రవారం సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డితో కలిసి శుక్రవారం మరోమారు ఈ కళాశాలను సందర్శించారు. ఓట్ల లెక్కింపు ఈవీఎంలను భద్రపర్చేందుకు స్ట్రాంగ్ రూమ్‌ల కోసం కళాశాల భవనంలో నెలకొన్న వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ వాటిపై సీపీ అదనపు కలెక్టర్లతో చర్చించారు. అంతకుముందు డిచ్‌పల్లిలోని సీఎంసీ కళాశాలను సందర్శించారు. రవాణా, పార్కింగ్ సదుపాయాలతో పాటు భద్రతాపరమైన అంశాలను పరిశీలించారు. నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ స్ట్రాంగ్ రూమ్‌ల కోసం అందుబాటులో ఉన్న అనువైన గదులను పరిశీలించారు. ఇదివరకు 2014 జమిలి ఎన్నికలు, 2019 పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను సీఎంసీ కళాశాలలోనే నిర్వహించినట్లు అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అయితే ఏండ్ల తరబడి నిరుపయోగంగా ఉన్నందున సీఎంసీ భవన సముదాయంలోని పలు గదులు నిర్వహణపరమైన లోపాలతో కూడుకుని ఉండడాన్ని గమనించిన కలెక్టర్.. వాటిని శుభ్రం చేయించి కౌంటింగ్ స్ట్రాంగ్ రూమ్‌లకు ఈ భవనం ఏ మేరకు ఉపయోగపడుతుందో అన్ని విధాలుగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, జిల్లా కార్మికశాఖ అధికారి యోహాన్, బోధన్ తహసీల్దార్ గంగాధర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్ ఉన్నారు.